

చిన్నపెండ్యాలలో సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

# సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించాలి

### గ్రంథాలయ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి

చిల్పూరు, అక్టోబర్ 18: సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని గ్రంథాలయ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో బూత్ కమిటీ ఇన్‌చార్జిలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గ్రామాల్లో గడపగడపకూ వెళ్లి ప్రజలకు తెలియజేయాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎత్తులను చిత్తు చేయాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు అనుగుణంగా మ్యానిఫెస్టోను విడుదల చేశారన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరికే సాధ్యమవుతుందన్నారు. కారు గుర్తుకే ఓటు వేసి కడియం శ్రీహరిని లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరారు. మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్‌నాయక్, ఎంపీపీ సరితా బాలరాజు, సర్పంచ్‌ల మండల ఫోరం అధ్యక్షుడు మామిడాల లింగారెడ్డి, ఆర్బీఎస్ మండల కోఆర్డినేటర్ జనగామ యాదగిరి, వంగాల జగన్మోహన్‌రెడ్డి, జిల్లా నాయకులు శ్యామ్‌కుమార్‌రెడ్డి, ఇల్లందుల సుదర్శన్, టీ సమ్మయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'కడియం' గెలుపు కోసం కృషి

### ఎస్సీ సెల్ కన్వీనర్ కనకం రమేశ్

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 18: వచ్చే ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరిని గెలిపించేందుకు దళితులు, ఉప కులాలు కృషి చేస్తాయని బీఆర్ఎస్ నియోజకవర్గం ఎస్సీ సెల్ కన్వీనర్ కనకం రమేశ్ అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలో బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకులతో కలిసి మేశ్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కడియం శ్రీహరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వం ద్వారా భూమి కొనుగోలు చేసి దళితులకు అందించారన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన దళిత సామాజిక వర్గం నేడు అభివృద్ధి కోసం పాటు పడే కడియంను లక్ష మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు.

**దళితుల మధ్య చిచ్చు పెడితే తరిమి కొడతాం..**


బీఆర్ఎస్‌లో ఉన్న వారంతా అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పనిచేయాలని కోరారు. కొందరు దళితుల మధ్య చిచ్చుపెట్టేలా ప్రవర్తించడం సరి కాదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. అలా కాకుండా దళితుల మధ్య చిచ్చు పెట్టాలని ప్రయత్నిస్తే తరిమికొడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ బీఆర్ఎస్ ఎస్సీ సెల్ కో కన్వీనర్ చాడ కుమార్, నియోజవర్గ కో ఆర్డినేటర్లు గడ్డమీది వెంకటస్వామి, మంద రమేశ్, తాటికాయల బాబు, రెడపంగి సైదులు, చింత జోసఫ్, నీరటి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కనకం రమేశ్

# సీఎం కేసీఆర్ 'హ్యాట్రిక్' సాధించాలి

- 'పల్లా'ను భారీ మెజార్టీతో గెలువాలి
- కొమురవెల్లి 'మల్లన్న'కు ముడుపు కట్టిన బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, అక్టోబర్ 18 : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించాలని కోరుతూ బుధవారం కొమురవెల్లి మల్లన్న ఆలయంలో కొమురవెల్లి, చేర్యాల, మద్దూరు, ధూళిమిట్ట మండలాల బీఆర్ఎస్ యువజన విభాగం, బీఆర్ఎస్వీ, సోషల్ మీడియా విభాగాల ఆధ్వర్యంలో నాయకులు మల్లన్నకు ముడుపు కట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగరేగు చెట్టు వద్ద ముడుపు కట్టి సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించాలని, బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధించాలని మల్లన్నను వేడుకున్నారు.అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు బీఆర్ఎస్‌పై చేస్తున్న అసత్య ప్రచారాలను ఎక్కడికక్కడ తిప్పికొట్టాలన్నారు. రానున్న ఎన్నికల్లో యువజన, విద్యార్థి, సోషల్ మీడియా సభ్యులు సైనికుల వలే పని చేయాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు డిపాజిట్లు గల్లంతు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల బాధ్యులు పాల్గొన్నారు.


కొమురవెల్లి మల్లన్న ఆలయంలో గంగరేగు చెట్టుకు ముడుపు కట్టిన బీఆర్ఎస్ అనుబంధ సంఘాల సభ్యులు

# చాటింపు గొప్పగ.. సభ చప్పగ..

- ములుగు సభలో పస లేకుండా రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ ప్రసంగం
- హిందీలో ఒకటి.. తెలుగులో మరోటి చెప్పడంతో అర్థం కాక సభికుల అయోమయం
- రాహుల్ మాట్లాతుండగానే వెళ్లిపోయిన జనం
- మాజీ ప్రధాని పీవీ పేరును ప్రస్తావించని ప్రియాంక
- ఆమె మాట్లాడుతుండగానే వెళ్లిపోయిన భూపాలపల్లి అభ్యర్థి


రాహుల్ గాంధీ ప్రసంగిస్తుండగా ఖాళీ అయిన కుర్చీలు

ములుగు, అక్టోబర్18(నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామాంజాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ బుధవారం సాయంత్రం నిర్వహించిన సభ పరిస్థితి 'అనుకున్నదొక్కటి.. అయ్యిందొక్కటి' అన్న చందంగా మారింది. చాటింపు గొప్పగా ఉన్నా.. సభ చప్పగా సాగడంతో ప్రజల నుంచి స్పందన కరువైంది. తెలంగాణ ప్రాంతంపై ఆవగింజంతైనా అవగాహన లేని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీల ప్రసంగాల్లో పస లేకపోవడం, వారు హిందీలో ఒకటి చెబితే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలుగులోకి అనువదిస్తూ మరోటి చెప్పడంతో సభకు వచ్చినవారు బిత్తరచూపులు చూశారు. పస లేని ప్రసంగాన్ని వింటూ మహిళలు 'దేవుడా రాములా' అంటూ అర్థం కాని ముచ్చట్లను కాసేపు విన్నారు. ఎంత విన్నా సొంపుగా లేదని అనుకున్నారో ఏమో రాహుల్ ప్రసంగిస్తుండగానే మహిళలు బయటకు వెళ్లిపోయారు. ప్రజలు వెళ్తున్న క్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆపేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఆగండంటే ఎక్కడ చీవాట్లు పెడుతారోనని ప్రేక్షక పాత్ర వహిస్తూ ఉండిపోయారు.

**ఎందుకు వచ్చినట్లు.. ఏం చెప్పినట్లు ?**

రామప్పకు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ వస్తున్నారని బీరాలు పలికిన కాంగ్రెస్ నాయకులకు ప్రజలు ఊహించని షాక్ ఇచ్చారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మాట్లాడుతున్న క్రమంలోనే వెళ్లిపోయి హస్తం నేతలను అవాక్కయ్యేలా చేశారు. భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు సైతం ప్రియాంక మాట్లాడుతున్న క్రమంలోనే వేదిక దిగి వెళ్లిపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రియాంక మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో ప్రధానులుగా పని చేసిన పలువురి పేర్లను ప్రస్తావించి తెలంగాణ నుంచి ఐదేళ్ల పాటు ప్రధానిగా పని చేసిన పీవీ నర్సింహారావు పేరును ప్రస్తావించకపోవడం తెలంగాణపై ఆమెకున్న వివక్షకు అద్దం పట్టింది. 'అసలు వీళ్లు ఎందుకు వచ్చినట్లు..? ఏం చెబుతున్నట్లు?' అంటూ చాలా మంది గందరగోళానికి గురయ్యారు. ట్రాన్స్‌లేషన్ బాధ్యతను ఉత్తమ్‌కుమార్ తీసుకోగా ఆయన ప్రజలను అయోమయానికి గురి చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పోడు పట్టాలను అందించినా విషయం తెలియకుండానే ప్రియాంక గాంధీ పోడు పట్టాల పంపిణీని ప్రభుత్వం వదిలి వేసిందని అవగాహన లేని మాటలు మాట్లాడారు. ప్రియాంక గాంధీ రెండు నియోజకవర్గాల అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేసే క్రమంలోనూ గండ్ర సత్యనారాయణ రావు వేదికపైకి రాలేదు. ఒకటి, రెండు సార్లు రేవంత్‌రెడ్డి పిలిచినా అందుబాటులోకి రాలేదు. దీంతో ప్రజలు గండ్ర ఎందుకు వేదికపైకి వెళ్లలేదని చర్చించుకున్నారు. ములుగు అభ్యర్థి సీతక్క రెండు, మూడు రోజుల నుంచి రాహుల్, ప్రియాంక గాంధీ వస్తున్నారు.. వరాల జల్లులు కురిపిస్తారని చేసిన డప్పు చాటింపు ముచ్చట్లు తుస్సుమన్నాయనే చెప్పవచ్చు. ప్రజలకు ఏం కావాలి ? వారి అవసరాలు ఏమిటని గుర్తెరుగని కాంగ్రెస్ నాయకులు, సభ మమ అనిపించారని వచ్చినవారు మాట్లాకుంటూ ఇంటి దారిపట్టడం కనిపించింది.

# 60 ఏండ్లలో కాంగ్రెస్ ఏం చేసింది ?

- మీరు ములుగుకు చేసింది ఏమిటి ?
- రామప్పను పట్టించుకున్నారా ?
- రాహుల్‌పై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఫైర్

హనుమకొండ, అక్టోబర్ 18 : 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఏమి చేశారో చెప్పాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై మంత్రి ఫైర్ అయ్యారు. బుధవారం ములుగులో నిర్వహించిన కాంగ్రెస్ సభ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలపై విరుచకపడ్డారు. వారి పాలనలో ఏనాడైనా ములుగు గురించి పట్టించుకోవడం, మాట్లాడిన సందర్భాలున్నాయా ? అని మంత్రి ధ్వజమెత్తారు. విభజన హామీల గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించారా ? అని ప్రశ్నించారు. అలాగే ములుగు గిరిజన యూనివర్సిటీ, మెడికల్ కళాశాలల మంజూరు గురించి కానీ మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వాళ్ల పాలనలో జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదన్నారు. మీ పాలనలో రామప్పను ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్, సీఎం కేసీఆర్ కృషితోనే రామప్పకు యునెస్కో గుర్తింపు వచ్చిందని, అంతర్జాతీయ వారసత్వ సంపదగా గౌరవం దక్కిందని మంత్రి అన్నారు. ములుగు జిల్లాను చేసింది కూడా సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. ములుగులో మెడికల్ కాలేజీ, జిల్లా హాస్పిటల్ ను ఏర్పాటు చేసి, ఏటూరునాగారంను డివిజన్ కేంద్రం చేసి పరిపాలనను ప్రజల ముంగిట్లోకి తెచ్చింది కేసీఆర్ కాదా? మీ పార్టీ ఎమ్మెల్యే ఉన్నా ములుగును అభివృద్ధి చేసింది కేసీఆర్ కాదా ? అని మంత్రి ప్రశ్నించారు. ములుగు ప్రజల ఆకాంక్షలను గౌరవించి అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. బీడు బారిన అటవీ ప్రాంతం ఈ రోజు పచ్చని తోరణంలా మారిందన్నారు. ఇంటర్నేషనల్ టూరిజం కేంద్రంగా నిలిచిందన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే వచ్చే మీలాంటి టూరిస్ట్‌లను ప్రజలు నమ్మబోరని మంత్రి అన్నారు. దొరికిన దొంగలను వెంటేసుకుని తిరిగితే, మిమ్మల్ని దొంగల్లాగే చూస్తారని మంత్రి పేర్కొన్నారు. ప్రజలు నమ్మేది బీఆర్ఎస్, సీఎం కేసీఆరేనని అన్నారు. సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించి బీఆర్ఎస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొస్తారని మంత్రి ఎర్రబెల్లి పేర్కొన్నారు. ములుగులో గెలిచేది సీతక్క కాదని, బడే నాగజ్యోతిని ప్రజలు ఆశీర్వదిస్తారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.

# ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు శిక్షణ

తొర్రూరు, అక్టోబర్ 18 : కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ సాధన కోసం వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ టీ రవీంద్ర తెలిపారు. తొర్రూరులోని నితిన్ భవన్ ఆవరణలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో విద్యార్థులకు కీలకమైన సూచనలు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 50 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులకు వారం రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ స్కాలర్‌షిప్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు వారి ఉన్నత విద్య కోసం నాలుగేళ్ల పాటు రూ.60 వేలు స్కాలర్‌షిప్ రూపంలో సమకూరుతాయని చెప్పారు. డిసెంబర్‌లో నిర్వహించే ప్రవేశ పరీక్ష నాటికి శిక్షణ పొందిన విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతుల నిర్వహణ ఉంటుందని, స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులకు మంచి గౌరవం దక్కుతుందని, పాఠశాలకు మంచి పేరు వస్తుందని చెప్పారు. ఈ శిబిరంలో విద్యార్థులకు లీడర్‌షిప్, వారి అభిరుచులకు తగ్గటు కోలాటం, పాటలు, వివిధ రంగాల్లో వారి నైపుణ్యం ప్రాతిపదికన శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిబిరంలో విద్యార్థులకు భోజనం, పుస్తకాల కోసం మహాత్మా హెల్పింగ్ హాండ్స్ ఫౌండర్ గంట రవీందర్‌తో పాటు మరికొంత మంది దాతలు అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు.